




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 304 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 21-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



2 లో

## ఏలియన్స్ గుట్టు బయటపెడతాం

- వాటికి సంబంధించిన ఫైళ్లను వెల్లడిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి


2 లో

## పాక్ సైనికుల్ని నిర్బంధించిన బీఎల్ఏ ఆర్మీ ..


- తమ వాళ్లే కాదంటున్న పాక్..
- ఐడీలు చూపిన పాక్ సైనికులు బంధీలు
- తాము దేశం కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధమైతే..
- తమ దేశం కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం

# ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

### మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఏఐ



- సాంకేతిక విప్లవంలో ఇదో అంకం
- హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం
- ఏఐ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సిఎం రేవంత్ రెడ్డి




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్శిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని -మిగతా 2 లో



## బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

- భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ
- రెండు నెలలుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభం
- తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం




**న్యూఢిల్లీ**

ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలలుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ క్రమంలో భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై -మిగతా 2 లో

## 15 రోజుల్లో తేల్చాలి..

- అణు ఒప్పందంపై ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్
- ఈలోగా ఒక ఒప్పందానికి రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిక
- మరోవైపు రష్యాతో కలిసి ఇరాన్ నావికా విన్యాసాలు
- ఒకవైపు ఒప్పందంపై చర్చలు అంటూనే.. రెండు దేశాలూ యుద్ధ సన్నాహాలు



**న్యూఢిల్లీ**

అమెరికా- ఇరాన్ మధ్య ఉన్న వివాదం ఎటూ తేలడం లేదు. తమతో అణు ఒప్పందం చేసుకుని తీరాల్సిందే అని ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి తెస్తున్నాడు. అయితే, ఈ అంశంపై ఇరాన్ కొన్ని షరతులు విధించింది. ఒకవైపు ఒప్పందంపై చర్చలు అంటూనే.. రెండు దేశాలూ యుద్ధ సన్నాహాలు కూడా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్ ఇచ్చాడు. 10-15 రోజుల్లో ఇరాన్ తమతో అణు ఒప్పందం చేసుకుని తీరాలని అల్టిమేటమ్ ఇచ్చాడు. -మిగతా 2 లో

# హామీలను అమలు చేసేలా బడ్జెట్ రూపొందించాలి

### కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్

- అధికారంలోకి వచ్చి 800 రోజులైనా ఒక్క హామీకి దిక్కులేదు
- నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు
- వెంటనే బడ్జెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలని డిమాండ్
- ఎన్నికల ముందు రాసిచ్చిన బాండ్ పేపర్ల గతేమయ్యింది
- కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఎగ్గొటారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**సిద్దిపేట ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు (డిమాండ్ చేశారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను తయారు చేయాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారువంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా, రాహుల్ రాసిచ్చిన బాండ్ పేపర్లు ఏమాయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 800 రోజులైనా ఒక్క హామీకి -మిగతా 2 లో

## భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్‌పై చర్చిస్తారు

- కంప్యూటింగ్ పరకరాలకు క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన
- డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా దృష్టి
- స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి పారిశ్రామిక క్లస్టర్లు
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- పలు సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్న ఏపి ప్రభుత్వం




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు సమీప భవిష్యత్‌లో వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు.ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. -మిగతా 2 లో

### ఎప్రిల్‌లో తెలంగాణలో

## సర్ ప్రక్రియ

- జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు




**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ఎస్ఐఆకు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా -మిగతా 2 లో

## హిందూ మహా సముద్ర రక్షణే లక్ష్యం

- అంతర్జాతీయ ఫోరం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భారతనౌకాదళం
- సభ్య దేశాల మధ్య సమన్వయం పెంచుతాం : దినేష్ కె త్రిపాఠి




**న్యూఢిల్లీ,**

విశాఖ కేంద్రంగా ఈనెల 15 నుంచి జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) మిలాన్-2026లో భాగంగా శుక్రవారం తూర్పునౌకాదళంలో 9వ ఇంటర్నేషనల్ ఓషన్ నేవల్ సింపోజియం (ఐఒఎన్ఎస్ -ఐయాన్స్) కాన్‌క్లేవ్ జరిగింది. 'హిందూ మహా సముద్ర ప్రాంతంలో సముద్ర భద్రతను పటిష్టం చేసే దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. భారత నౌకాదళం దీని అధ్యక్ష బాధ్యతలను స్వీకరించింది. రాయల్ థారులాండ్ నేవీ నుంచి నేవల్ చీఫ్ (అడ్మిరల్) దినేష్ కె త్రిపాఠి ఈ బాధ్యతలను తీసుకున్నారు. 2008లో ఐఒఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షత దేశంగా భారత్ ఉండేది. రెండేళ్ల పాటు అధ్యక్షత దేశంగా కొనసాగింది. మళ్లీ 16 ఏళ్ల తర్వాత ఈ గౌరవాన్ని ఇండియన్ నేవీ దక్కించుకుంది. 33 దేశాలకు చెందిన -మిగతా 2 లో

## పాక్ సైనికుల్ని నిర్బంధించిన బీఎల్ఏ ఆర్మీ..

- తమ వాళ్లే కాదంటున్న పాక్..
- ఐడీలు చూపిన పాక్ సైనికు బంధీలు
- తాము దేశం కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధమైతే..
- తమ దేశం కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం



**న్యూఢిల్లీ,**
పాకిస్తాన్ సైన్యానికి, బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) కి మధ్య నడుస్తున్న సైనికుల కిడ్నాప్ అంశం కీలక మలుపు తిరిగింది. బీఎల్ఏ ఆధీనంలో ఉన్న సైనికులు తమ వాళ్లు కాదని పాకిస్తాన్ ఆర్మీ ప్రకటించింది. దీంతో బీఎల్ఏ చెరలో ఉన్న పాక్ సైనికులు తమ ఐడీలు చూపించారు. పాక్ ఆర్మీ తమను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి చివరి వారంలో పాక్ సైన్యంపై బీఎల్ఏ మెరుపు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో పాక్ సైనికులు, బీఎల్ఏ సభ్యులు కూడా మరణించారు. రెండువైపులా కొందరినీ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ దాడుల సందర్భంగా బీఎల్ఏ సభ్యుల్ని పాక్ ఆర్మీ అరెస్ట్ చేస్తే.. కొందరు పాక్ సైనికుల్ని బీఎల్ఏ కిడ్నాప్ చేసింది. తమ ఆధీనంలో ఏడుగురు పాక్ సైనికులు ఉన్నట్లు ఇటీవల బీఎల్ఏ ప్రకటించింది. బంధీలుగా ఉన్న పాకిస్తాన్ సైనికులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా విడుదల చేసింది. వారిని విడుదల చేయాలంటే పాకిస్తాన్ ఆర్మీ అరెస్టు చేసిన తమ వారిని విడుదల చేయాలని బీఎల్ఏ డిమాండ్ చేసింది. లేకుంటే తమ ఆధీనంలో ఉన్నవారిని చంపేస్తామని హెచ్చరించింది. ఇందుకు ఈ నెల 22 వరకు గడువిచ్చింది. అంటే ఇంకా రెండు రోజులే ఉంది. అయితే, ఈ విషయంలో పాకిస్తాన్ భిన్నంగా స్పందించింది. తమ సైనికులకు సంబంధించి ఎవరూ మిస్ కాలేదని తెలిపింది.అంతేకాదు.. బీఎల్ఏ ఆధీనంలో ఉన్నవారు తమ సైనికులే కాదని తేల్చిచెప్పింది. దీంతో బంధీలుగా ఉన్న పాక్ సైనికులు షాకయ్యారు. తమకు సంబంధించిన ఐడీలు చూపిస్తూ వీడియో విడుదల చేశారు. ఈ ఐడీ కార్డు పాక్ ప్రభుత్వమే జారీ చేసిందన్నారు. తాము పాక్ సైనికులం కాకుంటే మరెవరని ప్రశ్నించారు. తమ కుటుంబ పరిస్థితి గురించి వివరించారు. తాము దేశం కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధమైతే.. తమ దేశం కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశం చివరకు ఎటు వెళ్తుందో చూడాలి.

## బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి తరువాయి

కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. కొద్దికాలం క్రితం భారత వ్యతిరేక యువనేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యకు గురికావడం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హదీ హత్యానంతరం హిందూ మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. గత డిసెంబర్ నుంచి భారత్-బంగ్లా మధ్య వీసా సర్వీసులు నిలిచిపోయాయి. అయితే యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తప్పుకోవడం, ప్రజాస్వామ్యబద్ధంగా తారిఖ్ రెహ్మాన్ ఎన్నికకావడంతో భారత్-బంగ్లా మధ్య సంబంధాల పునరుద్ధరణకు సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి.

## 15 రోజుల్లో తేల్చాలి..

మొదటి తరువాయి

ఒకవేళ ఈలోగా ఒక ఒప్పందానికి రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. "ఇరాన్‌తో అణు ఒప్పందం అంత సులభం కాదని కొన్నేళ్లుగా అర్థమైంది. అయితే, మేం తప్పకుండా అణు ఒప్పందం చేసుకుని తీరాలి. లేకుంటే ఇరాన్ విషయంలో ఎలాంటి పరిణామాలైన జరగవచ్చు. పది రోజుల్లో సరైన ఫలితం కనిపించాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించాడు. ఇరు దేశాలూ ఇలా చర్చలు అంటున్నా ఎవరికి వారు యుద్ధ సన్నాహాల్లో ఉన్నారు. ఈ ప్రాంతంలో అమెరికా సైనిక చర్యలు ప్రారంభించింది. మధ్యధరా సముద్రంలో ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ (యుద్ధనౌక)ను మోహరించింది. ఈ ప్రాంతంలో సైనిక చర్య చేపట్టాలంతే తగినంత పూర్తిస్థాయి సైన్యం కావాలని సీనియర్ ఆర్మీ అధికారులు అంటున్నారు. మార్చి నెల మధ్యలో ఈ చర్యలకు అవకాశం ఉందని భావిస్తున్నారు.ఇదే సమయంలో ఇరాన్ కూడా తన ఆయుధాల్ని సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అణ్వాయుధాల విషయంలో ఇటీవలే జెనీవాలో ఇరాన్-అమెరికా మధ్య కొన్ని చర్చలు జరిగాయి. ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. కానీ, దీనిపై చర్చించేందుకు ఇరాన్ నిరాకరించింది. ఇదే సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిపి ఇరాన్‌పై దాడి చేస్తాయనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు రష్యాతో కలిసి ఇరాన్ నావికా విన్యాసాలు నిర్వహించింది. అగ్రదేశాలు ఇలాంటి చర్యలకు దిగుతుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

## ఎప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

మొదటి తరువాయి




అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.రాబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.


## హిందూ మహా సముద్ర రక్షణే లక్ష్యం

మొదటి తరువాయి

నౌకాదళాధిపతులు, సముద్ర భద్రతా సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి శుక్రవారం హాజరయ్యారు.

# ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి


మొదటి తరువాయి




ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చు కోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశర చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఏలియన్స్ గుట్టు బయటపెడతాం

**-వాటికి సంబంధించిన ఫైళ్లను వెల్లడిస్తాం**
**-అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి**




**వాషింగ్టన్,**
అమెరికాలో ఏలియన్స్, యూఎఫ్ఓ లకు సంబంధించిన ప్రభుత్వ ఫైళ్లను విడుదల చేసే పక్రియను ప్రారంభించాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువులకు సంబంధించిన రహస్య ఫైళ్లను గుర్తించి.. వాటిని బహిర్గతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రంప్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో గ్రహాంతర వాసుల ఉనికిపై దశాబ్ద కాలంగా సాగుతున్న అమెరికన్ల ఉత్కంఠకు తెరపడనుంది. ప్రజల్లో ఈ రహస్యాల పట్ల ఉన్న ఆసక్తిని తీర్చాలని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు. యూఎస్ మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా.. గ్రహాంతరవాసులు ఉన్నారని ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించడంతో ఈ వివాదం రాజుకుంది. దీనిపై ఒబామా నాడు మాట్లాడుతూ.. 'గ్రహాంతర వాసులు ఉన్నది నిజమే కావచ్చు. కానీ నేనెప్పుడూ వారిని చూడలేదు' అని అన్నారు. అమెరికాలోని ఏరియా 51లో వారిని దాచిపెట్టారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని ఆయన వ్యాఖ్యానించారు. తన పదవీ కాలంలో ఏలియన్స్ భూమిపై సంచరించినట్లు ఎలాంటి ఆధారాలూ లభించలేదని స్పష్టం చేశారు. అయితే.. ఈ సమాచారాన్ని ఒబామా బహిర్గతం చేయడాన్ని తప్పుబట్టారు ట్రంప్. క్లాస్ఫి÷డ్ సమాచారాన్ని బయటపెట్టి ఒబామా పెద్ద తప్పుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరల్ అయిన ఒబామా 'ఏరియా 51' వ్యాఖ్యలను ట్రంప్ ఉదహరిస్తూ.. 'ఏలియన్స్‌లో ఎవరున్నారో నిజంగా నాకు తెలియదు. కానీ ప్రభుత్వం వద్దనున్న సమాచారాన్ని మాత్రం బయటపెడతాను' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. గ్రహాంతర సాంకేతికతకు సంబంధించి తమ వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని 2024 మార్చిలో పెంటగాన్ ఓ నివేదికలో పేర్కొంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం.. వాటికి సంబంధించిన సమాచారమేమీ లేదని.. ఆకాశంలో కనిపించిన వింత వస్తువులు సహజమైనవి కావచ్చని స్పష్టం చేసింది. కానీ దీనిపై ఇప్పుడు ట్రంప్ సెక్రటరీ ఆఫ్ వార్ సహా ఇతర ఏజెన్సీ సంస్థలను రంగంలోకి దింపి ఈ రహస్య పక్రియను ఛేదించేందుకు యత్నించడం చర్చనీయాంశమైంది. అయితే.. ఈ రహస్య పత్రాలను ప్రజల ముందుకు తీసుకువస్తారా లేదా అనే విషయమై ఎలాంటి స్పష్టతనివ్వలేదు ట్రంప్. ఈ÷ల్లో అత్యంత సంక్లిష్టమైన, ఆసక్తికరమైన, ముఖ్యమైన విషయాలకు సంబంధించిన సమాచారం ఏది ఉన్నా బహిర్గతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏది ఏమైనా ట్రంప్ తాజా నిర్ణయంతో.. అంతరిక్షంలో ఉన్న ఇతర జీవుల ఉనికిపై అమెరికా ప్రభుత్వ అధికారిక వైఖరి ఏంటనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎన్నో ఖగోళ విషయాలు బయటకు వస్తాయని, చాలా మందికి అంతుచిక్కని ప్రశ్నలకు సమాధానం లభించనుందని శాస్త్రవేత్తల్లో ఆసక్తి నెలకొంది.

# హామీలను అమలు చేసేలా బడ్జెట్ రూపొందించాలి

మొదటి తరువాయి

దిక్కులేదని, గెలిచిన నెలకే వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 4000 పెన్షన్ అన్నారు. 27 నెలలైనా రాలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిధులు పెడతారా, లేదా? అంటూ ప్రశ్నించారు. నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు. ఒక్కరికైనా రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. వెంటనే బడ్జెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఎగ్గొట్టారని, రాజీవ్ యువ వికాసం అంతా బూటకమని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లన్నీ ఉత్త మాటలే. అసెంబ్లీలో మాయ మాటలు మాని, వాస్తవ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకిచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10వేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 25 వేలు, డిగ్రీకి రూ. 50వేలు, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి, ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20 వేలు కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపిందని విమర్శించారు . వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ అని చెప్పి మాయమాటలు చెప్పారని, ఏటా రూ. 15వేలు రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందని పేర్కొన్నారు. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు చేయగా కాంగ్రెస్ రూ. 4వేలు ఇస్తామని హామీ ఇప్పటి వరకు నెరవేర లేదని అన్నారు. ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత , చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4వేలు పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని, రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్‌పై చర్చిస్తారు

మొదటి తరువాయి

ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ - ఏఐ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు.. క్వాంటం ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న కృత్రిమ మేథస్సు ద్వారా పోటీతత్వం అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరై.. తన అభిప్రాయాలను పంచుకు న్నారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి పాల్గొన్నారు. సమీప భవిష్యత్‌లో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుందని చెప్పుకొచ్చారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టం రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని.. దేశం దాన్ని సాధించి తీరుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో క్వాంటమ్ - ఏఐ రంగాల్లో నైపుణ్యాభి వృద్ధి, మౌళిక వసతుల అభివృద్ధి కల్పించే దిశగా ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది సర్కార్. ఏపీని క్వాంటమ్ - ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం... అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ - క్వాంటమ్ రంగాల్లో శిక్షణ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ - క్వాంటమ్ వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

## మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో పలు అభివృద్ధి పనులకు నాంది



**గన్నేరువరం, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామంలో ఎంపీ నిధుల ద్వారా పోచమ్మ గుడి వద్ద బోరు శాంక్షన్ చేయబడింది. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తన ఎంపీ నిధుల నుండి ఒక లక్ష రూపాయల వ్యయంతో ఈ బోరు మంజూరు చేయగా, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బూత్ అధ్యక్షుడు రామిడి కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు కేంద్రమంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించి బోరు మంజూరు చేసినందుకు, అలాగే సకరించిన ముత్యాల జగన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ పోలవేణి సంతోష్, బామండ్ల రాజు, బామండ్ల మల్లయ్య, దానబోయిన రాజ్ కుమార్, తుమ్మ అరుణ్‌తో పాటు బిజెపి సీనియర్ నాయకులు ఫకీడే మహేందర్, గాదె వెంకన్న, దానబోయిన ప్రవీణ్, దోపాట అనిల్, దోపాట వినోద్, మర్ధనపేట నరేష్, పకిడే అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


## వంతడుపుల గ్రామపంచాయతీలో గ్రామీణ భాగ్యస్వామి సదస్సు



**ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంతడుపుల గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామీణ భాగ్యస్వామి విశ్లేషణాత్మక అంశంపై సదస్సు (పి.ఆర్.ఏ) నిర్వహించారు. జగిత్యాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆర్. శ్రీజ, యు. శృతి, బి. హారిత, బి. స్వాతిక, ఎన్. శ్వేత, ఎస్. భవాని శిక్షణలో భాగంగా కరీంనగర్ టీ.ఆర్.వి.కె ఆధ్వర్యంలో పలు అంశాలపై ప్రదర్శనలు చేశారు. గ్రామ సమస్యల పరిష్కారం, వ్యవసాయానికి సంబంధించిన సామాజిక మరియు వనరుల పటం, పైచార్ట్, దలిక పటం, జనాభా పైచార్ట్, కాలక్రమరేఖలను గీసి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గంగాభవాని, సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ గంగాచారి, గ్రామ సెక్రటరీ మహమ్మద్ అలీ, రైతులు భూపతి రెడ్డి, చిమ్మరగొట్టు శ్రీనివాస్ రాజిరెడ్డి, సత్తిరెడ్డి, లక్ష్మరెడ్డి, తిరుపతి రెడ్డి, వామన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రవీందర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**తిమ్మాపూర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. చొప్పదండి, చిగురుమామిడి, గన్నేరువరం మండలాలకు చెందిన 50 మంది సర్పంచులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచులు పంచాయతీరాజ్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహనతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి సర్పంచ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, ప్రజా సౌకర్యాలపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సర్పంచులు పాల్గొన్నారు.

## వేదమంత్రాలతో సిల్వర్ కుత్తు ఉత్సవం

**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎగువ అహోబిలంలో ఉత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో వేద పండితులు భక్తులు పాల్గొన్నారు

## పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ అనైతిక పొత్తు



**జమ్మికుంట, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు విమర్శించారు. బీజేపీ కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం సందర్భంగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, స్వామి వివేకానంద, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లకు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు స్పష్టమైన మెజారిటీ లేకపోయినా లోపాయికారీ ఒప్పందం చేసుకుని చైర్మన్ ఎన్నికల్లో పాల్గొన్నారని ఆరోపించారు. బిజెపి మద్దతు కోసం వైస్ చైర్మన్ పదవి, కోట్ల రూపాయల ఆశ చూపినా పార్టీ నిర్ణయం మేరకు బిజెపి కౌన్సిలర్లు అవినీతి పార్టీలకు మద్దతు ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రకృతి, వైజ్ఞానిక దృక్పథ రక్షణకై విద్యార్థులకు అవగాహన సదస్సు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ప్రకృతిని, వైజ్ఞానిక దృక్పథాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడకపోతే గాలి, నీరు, ఆహారం కలుషితమవుతాయని, మానవుడు విచ్చలవిడిగా యంత్రాల వాడకం, రసాయనాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం ప్రమాదంలో పడుతోందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ సైన్స్ పట్ల ప్రజలకు అవగాహన పెంచాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. అమ్మ నేత్ర అవయవదాన ప్రోత్సాహక సంఘం నేత ఈశ్వరలింగం నేత్రదానం, అవయవదానం, దేహదానం, చర్మదానం, కేశదానం వంటి సేవలు అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపగలవని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, యాత్ర కోఆర్డినేటర్ ఏ. విజయ్ కుమార్, విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు ఆదం రాజు, నాయకురాలు శోభారాణి, కార్యదర్శి మహమ్మద్ అలీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి. సురేష్, కళాశాల ప్రిన్సిపల్ జే. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బోగస్ ఓట్లను తొలగించాలని గువ్వల బాలరాజు డిమాండ్



**అచ్చంపేట, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట పురపాలక పరిధి మరియు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమంగా చేరిన బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు, ఊర్లో లేని వారి పేర్లు ఇంకా జాబితాలో కొనసాగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బి.ఎల్.ఓలు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే నిర్వహించి అనర్హులను తొలగించాలని కోరారు. కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం అక్రమంగా ఓట్లను చేర్చారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా తప్పులేని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందని గుర్తు చేశారు. ఓటు పౌరుడి వజ్రాయుధం. అక్రమ ఓట్లతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలని చూడటం దుర్మార్గం. అధికారులు వెంటనే బోగస్ ఓట్ల ఏరివేత చేపట్టాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అధికారులకు నిరసన తెలిపారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. ఫిబ్రవరి 17న హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరిగిన పోటీల్లో పెద్దపల్లి జిల్లాకు చెందిన 20 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్‌జాగ్ వాకింగ్‌లో మొదటి బహుమతి సాధించగా, కమాన్‌పూర్ మండలానికి చెందిన ఎడునూరి పౌర్ణమి చెస్ పోటీలో మొదటి బహుమతి గెలుచుకుంది. రొంపికుంటకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో మొదటి బహుమతి, మ్యూజికల్ చైర్‌లో రెండవ బహుమతి, జిగ్‌జాగ్ వాకింగ్‌లో రెండవ బహుమతి సాధించాడు. విజేతలను కలెక్టర్ కోయ శ్రీ హర్ష, జిల్లా విద్యాధికారి జి. శారద ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ జి. కవితతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ ఆశావహులకు ఉచిత శిక్షణ

**-- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఆసక్తి గల యువతకు అగ్నివీర్ యూపిహెచ్ఎస్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు 90 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. అగ్నివీర్ యూపిహెచ్ఎస్ శిక్షణ పథకం -- 2026 ద్వారా అభ్యర్థులకు శారీరక, లిఖిత పరీక్షల పూర్తి స్థాయి శిక్షణ కల్పించబడుతుంది. ఇందులో ఫిజికల్ ట్రైనింగ్, మెడికల్ పరీక్షల అవగాహన, రాత పరీక్ష కోచింగ్, గ్రౌండ్ ప్రాక్టీస్, యూనిఫాం, స్టడీ మెటీరియల్ వంటి సౌకర్యాలు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసక్తి గల యువత ఫిబ్రవరి 23 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఫిబ్రవరి 25న మెడికల్ పరీక్షల అనంతరం అభ్యర్థుల ఎంపిక జరగనుందని తెలిపారు. శిక్షణ మే 31 వరకు కొనసాగుతుంది. పెద్దపల్లి జిల్లా పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని, వారు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, వయస్సు 17.5 నుండి 22 సంవత్సరాల మధ్య ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శిక్షణ సమయంలో భోజనం, తరగతులు, గ్రౌండ్ ప్రాక్టీస్, స్టడీ మెటీరియల్ అందించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రుద్రమదేవి స్టేడియం, సెంటెనరీ కాలనీ, రామగిరి వద్ద ఉదయం 6 నుండి 8 గంటల వరకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 9573688952, 9949725997, 8106807784 నెంబర్లను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## టి.డబ్ల్యూ.ఏ.హెచ్.ఎస్ గర్ల్స్ పాఠశాలలో బేటి బచావో

**- బేటి పడావో అవగాహన సదస్సు**



**దేవరకొండ, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ మండల పరిధిలోని టి.డబ్ల్యూ.ఏ.హెచ్.ఎస్ గర్ల్స్ ముదిగొండలో బేటి బచావో -- బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ చంద్రకళ బాలికల రక్షణ, విద్య ప్రాముఖ్యత, డిజిటల్ సురక్షితతపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఒక బాలిక చదివితే ఒక కుటుంబం చదివినట్టేనని, బాలిక సమాజానికి శక్తి, దేశానికి భవిష్యత్తు అని పేర్కొన్నారు. సేవ్ గర్ల్ చైల్డ్ -- ఎడ్యుకేట్ గర్ల్ చైల్డ్ నినాదం ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ డి. చిట్టెమ్మ, హెచ్.ఎమ్. హనుమ కుమారి, విద్యార్థినీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### శుక్రవారం సభ ప్రాధాన్యం

# ప్రజారోగ్య పర్యవేక్షణ

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**గంగాధర, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించేందుకు శుక్రవారం సభలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. చొప్పదండి మండలం చాకుంట అంగన్వాడి కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన శుక్రవారం సభలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ తల్లీ--పిల్లల ఆరోగ్యానికి, పోషణకు ఈ సభలు ఎంతో దోహదం చేస్తున్నాయని అన్నారు. పిల్లల ఆరోగ్యంపై సందేహాలు ఉంటే ప్రభుత్వ వైద్యులకు తెలియజేయాలని సూచించారు. ప్రతినెలా అంగన్వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి గ్రామాల వారీగా నివేదికలు తెప్పించి పర్యవేక్షిస్తున్నామని, బరువు తక్కువగా ఉన్న శిశువులను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అత్యంత బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు ఎన్ఆర్సి ద్వారా చికిత్స అందించి సాధారణ స్థాయికి తీసుకువస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 95 శాతం మహిళలు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారని, 245 మంది మహిళలకు రెండవ దఫా స్క్రీనింగ్ పూర్తయిందని కలెక్టర్ వివరించారు. హెల్త్ క్యాంపులను ప్రజలు మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సర్పంచులు శుక్రవారం సభ నిర్వహణలో చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పరీక్షలు పూర్తయ్యేంతవరకు ప్రతిరోజు బడికి, ప్రత్యేక తరగతులకు పంపాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ పురం మాధవి, ఉపసర్పంచ్ వేముల శేఖర్, సిడిపిఓ నర్సింగారాణి తదితరులు పాల్గొన్నారు.

## శుక్రవారం సభలో అక్షరాభ్యాసం



**గంగాధర, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఆచంపల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌లో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరె తేజశ్రీ రాజశేఖర్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆర్బీఎస్కే వైద్యులు డాక్టర్ పి. సురేష్, డాక్టర్ ఎస్. ప్రతిభ, ఏఎన్ఎం స్వప్న, ఫార్మాసిస్టు రాజశేఖర్ పాల్గొన్నారు. వైద్యులు పిల్లలకు హెల్త్ చెకప్ చేసి, తల్లిదండ్రులకు ఆరోగ్య సూచనలు అందించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్ఆర్సీకి రిఫర్ చేశారు.


## రాష్ట్ర స్థాయి పోటీల్లో వివేకానంద విద్యాలయం విద్యార్థుల ఎంపిక





**గంగాధర, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వివేకానంద విద్యాలయం విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఇటీవల నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ -- 2వ ఎడిషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎం. మణిశంకర్ (ఖో ఖో), ఎస్. అక్షయ కీర్తి (హ్యాండ్బాల్) రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాబోయే పోటీల్లో ఖో ఖో క్రీడలు నల్గొండ జిల్లాలో, హ్యాండ్బాల్ పోటీలు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్నాయని జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కృషి అభినందనీయమని, క్రీడలలో సాధించిన విజయాలు ఇతర విద్యార్థులకు ఆదర్శమని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉషారాణి, అనంతారెడ్డి, హెడ్ మాస్టర్ నర్సింగరావు మరియు అధ్యాపక బృందం అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అల్ట్రాటెక్ మైన్స్ విభాగంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన







**పాలకుర్తి, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బసంతనగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ మైన్స్ విభాగంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్ట్రాటెక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో వేదపండితులు అర్చనలు, అభిషేకాలు, హోమాలు, నవగ్రహ పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం కార్మికులు భజన కార్యక్రమం చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్లాంట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, హెచ్.ఆర్. పార్థసారథి, కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని సతీష్, కండె స్వామి, రమేష్, ఈసాల తక్కలపల్లి గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్, సంకరి మల్లేశం, రాయగట్టు, వేముల ఎల్లయ్య, కచ్చపాక తిరుపతి, నరేష్, సంతోష్, శ్రీనివాస్, అమరగాని కుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు కరీంనగర్ క్రీడాకారుల ఎంపిక




**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికై బయలుదేరారు. ఈనెల 15 నుండి 20 వరకు జరుగుతున్న పోటీల్లో 43 క్రీడాంశాలలో వారు ప్రతిభ కనబరుస్తున్నారు. ఫుట్‌బాల్, స్విమ్మింగ్, హాకీ, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్‌బాల్, కరాటే పోటీలు గచ్చిబౌలిలో, నెట్‌బాల్, బాక్సింగ్ మహబూబ్‌నగర్‌లో, అథ్లెటిక్స్ హనుమకొండలో, హ్యాండ్‌బాల్ ఎల్బీ స్టేడియంలో, యోగ రంగారెడ్డిలో, కోకో నల్గొండలో, కబడ్డీ నారాయణపేటలో, బాస్కెట్‌బాల్ నిజామాబాద్‌లో, సెపక్తక్రా వనపర్తిలో జరుగుతున్నాయి. జిల్లాకు పేరు తేవాలని క్రీడాకారులు కృషి చేయాలని యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ పోటీలకు సహకరించిన పీఈటీలు, పీడీలు, క్రీడా సంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్‌లకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై గుగ్గిళ్ళ రమేష్ ఘాటు విమర్శలు



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళ రమేష్ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం కమలాకర్‌కు లేదని, అసత్య ప్రచారాలు చేయించడం సిగ్గుమాలిన చర్య అని రమేష్ ఆరోపించారు. తాను చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానని, ఎక్కడా అన్‌పార్లమెంటరీ పదాలు ఉపయోగించలేదని స్పష్టం చేశారు. కమలాకర్ తనపై విద్వేషంతో అనుచరులను మాట్లాడిస్తున్నారని, ఇది ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే దాడులు చేస్తానని చెప్పి ఇప్పటివరకు చేయలేదని ఎద్దేవా చేశారు. తనపై అసత్య ప్రచారాలు ఆపకపోతే కమలాకర్ రాజకీయ జీవితంలోని మలుపులను ఆధారాలతో బయటపెడతానని హెచ్చరించారు. తాను ఐదుసార్లు ప్రజా జీవితంలో గెలిచానని, ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు ఎప్పుడూ చేయలేదని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కమలాకర్‌ను రాజకీయంగా బొంద పెట్టడమే లక్ష్యమని, బిజెపి కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వంలో పని చేస్తుందని రమేష్ తెలిపారు. 2028లో కమలాకర్ ఎమ్మెల్యేగా నిలబడలేదని, ప్రజాబలం కోల్పోయారని ఎద్దేవా చేశారు.

## వాట్సప్ గ్రూపులపై నిఘా - ఎస్సై వెంకటేష్




**ఆమనగల్లు, ఫిబ్రవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :**
సోషల్ మీడియాలో విద్వేష పూరిత, రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదని ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. కుల, మత, రాజకీయ వివాదాలకు దారి తీసే పోస్టులు,వీడియోలు, షేర్ చేసినా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. గ్రూప్ అడ్మిన్ లకు బాధ్యత ఉంటుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో నిరంతరం నిఘా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన, చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్ కుమార్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 66వ డివిజన్ కార్పొరేటర్‌గా భారీ విజయాన్ని సాధించిన వంగల పవన్ కుమార్‌ను డివిజన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్ మాట్లాడుతూ, నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికి సర్వదా రుణపడి ఉంటాను. డివిజన్‌లో ఏ సమస్య వచ్చినా వెంటనే నా దృష్టికి తీసుకువస్తే శాయశక్తుల కృషి చేస్తాను అని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ సభ్యులు అహ్మద్ హమీద్, కట్ట శ్రీనివాస్, కొత్త ప్రకాశ్, గొట్టిముక్కల లక్మన్, గంగన్న, కొత్త శ్రీనివాస్, కట్ట వెంకట్ చారి, కన్నోజు రమేశ్, జి. శ్రీనివాస్, హమీద్ సాహిల్, రవి తదితరులు పాల్గొన్నారు.


# రైతు బీమా పెండింగ్ క్లైములను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు రిజిస్ట్రేషన్‌ను నూరు శాతం పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మీ సేవా కేంద్రాల్లో 15 రూపాయల రుసుముతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై రైతులకు సమాచారం ఇవ్వాలని, ఫోన్ లేని వారు రిటైలర్ వద్ద కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతు బీమా పెండింగ్ క్లైములను త్వరగా పూర్తి చేయాలని, పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థుల అవగాహన కోసం మట్టి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కైసీని ప్రతి రైతు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడిఏ మహేష్, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# అటెండెన్స్ శాతం పేరుతో విద్యార్థులకు అన్యాయం



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన యూనివర్సిటీలో వికలాంగుడైన విద్యార్థి నర్సయ్యను పరీక్ష రాయడానికి అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ విద్యార్థులు మూడో రోజు కూడా తరగతి గదిలో శాంతియుతంగా నిరసన కొనసాగించారు. అటెండెన్స్ శాతం పేరుతో విద్యార్థులను అన్యాయంగా వేధించడం వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులు మాజీ ఎంపీ వినోద్ కుమార్‌ను కలిసి విషయం వివరించారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులకు యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాలను తెలియజేశారు. యూజీసీ, ఐజీఏఎస్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్, ఎస్సీ/ఎస్టీ సెల్ డైరెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వికలాంగ విద్యార్థికి పరీక్ష రాయడానికి అనుమతి ఇవ్వాలని, అటెండెన్స్ పేరుతో జరుగుతున్న వేధింపులను నిలిపివేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# ఆవోపా ఆధ్వర్యంలో కార్పొరేటర్లకు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణ ఆవోపా అధ్యక్షుడు నలమాసు సుదర్శనం ఆధ్వర్యంలో 66వ డివిజన్ నుండి ఎన్నికైన వంగల పవన్, 57వ డివిజన్ నుండి ఎన్నికైన కొలిపాక రమ్య శ్రీనివాసును ఘనంగా సన్మానించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శేష వస్త్రం, పూల మొక్కలతో సత్కరించారు. ఎన్నికైన కార్పొరేటర్లు సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటామని, ఆవోపా నిర్వహించే కార్యక్రమాలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నలుమాచు చంద్రశేఖర్, గజవాడ శ్రీనివాస్, కోశాధికారి కట్కూరి చంద్రశేఖర్, ముస్త్యాల సతీష్‌కుమార్, అయిత యోగేంద్ర ప్రసాద్, పుల్లూరు రవీందర్, బీవీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు




**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ముగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, న్యాయవాది ఏ. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం, పేదరికం, లింగ వివక్ష, మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడమే ఈ దినోత్సవం ఉద్దేశమని వివరించారు. న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, రాచకొండ దేవేందర్ మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ న్యాయం అందాలనే రాజ్యాంగ ఆశయాలను గౌరవించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ రద్దు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదరికం అడ్డుగోడ కాకూడదని, ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెండోట జ్యోతి, డి. ప్రకాష్, పి. పద్మ, శ్రీనివాస్, నాగభూషణం, సిహెచ్. ప్రభాకర్ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలను న్యాయ నిపుణులు నివృత్తి చేశారు.

# శుక్రవారం సభలో హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ ప్రారంభం

**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోతిరాంపూర్ సెక్టార్, శ్రీనగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ సబిత మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను సభలో చెప్పుకోవచ్చని, గర్భిణీలు, బాలింతలు తప్పక హాజరుకావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలు జరుగుతున్నాయని, షుగర్ బోర్డుల ద్వారా ఆహారంలో చక్కెర వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ సఫిర్ హుస్సేన్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలకు 50 రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమం చివరలో సీమంతాలు,




అన్నప్రాసన నిర్వహించారు. ఈ సభలో ఐసీడీఎస్ అరుణ, బిసి సతీష్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. ఈరోజు ఉదయం మోతాజుఖానా పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సంరక్షకుల కోసం హెపటైటిస్ బి అడల్ట్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షకులను హెపటైటిస్ బి వ్యాధి నుండి రక్షించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య అధికారి సుధ, ఇమ్యునైజేషన్ అధికారి సాజిద్, ఉప వైద్య అధికారి రాజగోపాల్ రావు, డిటిటి ఉమాశ్రీ, ఎంహెచ్ఎన్ సన జవేరియా, వైద్యాధికారి ఇమ్రాన్, సూపర్వైజర్ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీడిడి కమిషనర్ సబ్యసాచి ఘోష్‌కు మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అభినందనలు


**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యసాచి ఘోష్‌ను తెలంగాణ ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డాక్టర్ బుద్ధ జ్యోతి ప్రకాష్ సింగరేణి ఎండీగా బదిలీ కావడంతో, వారి స్థానంలో సభ్యసాచి ఘోష్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, కార్యదర్శి యుఏ అరవింద్ కుమార్ శుక్రవారం కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీడిడి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో జరిగిన



సమీక్ష సమావేశంలో సభ్యసాచి ఘోష్ చొరవ తీసుకొని శాఖకు సంబంధించిన 73 పెండింగ్ బిల్లులపై దాదాపు 88 కోట్ల నిధులను మంజూరు చేయించినందుకు అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. అదేవిధంగా మినిస్టీరియల్ స్టాఫ్‌కు సంబంధించిన పెండింగ్ డిమాండ్లను కూడా ఆయన ముందుకు తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కమిషనర్, లిఖితపూర్వకంగా డిమాండ్లను సమర్పిస్తే తప్పకుండా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ వార్షిక డైరీ విడుదల కార్యక్రమానికి అతిథిగా హాజరుకావాలని ముందస్తుగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా సభ్యసాచి ఘోష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆయన మార్గదర్శకత్వంలో శాఖ మరింత శోభను సంతరించుకుంటుందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

# భక్తి శ్రద్ధలతో శుక్రవారం ప్రార్థనలు

కడ్తాల్, ఫిబ్రవరి 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) : పవిత్ర రంజాన్ మాసం మొదటి శుక్రవారంను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మస్జిద్ కుబా మస్జిద్ అర్షద్



లలో మసీదు ఇమామ్ లు జహీరుద్దీన్, తహజీబ్ ఆలం ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మసీదు కమిటీ ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంట అభివృద్ధి చెందాలని అల్లాహ్ ను ప్రార్థించారు. మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# బంజారాల మనోభావాలతో చెలగాటమాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**-- బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్**



**హుస్నాబాద్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ బంజారాల మనోభావాలను దెబ్బతీస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తున్నారని భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ తీవ్రంగా విమర్శించారు. ఫిబ్రవరి 20 వరకు నియోజకవర్గంలో అధికారికంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించకపోవడం బంజారాల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే చర్య అని ఆయన పేర్కొన్నారు. బంజారాల ఓట్లతోనే పొన్నం ప్రభాకర్ గెలిచారని, సంవత్సరం క్రితం బంజారా భవన్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చినా ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదని ఆయన ఆరోపించారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా కనీసం స్పందించని స్థానిక మంత్రి, బంజారాలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023లో అధికారంలోకి రావడానికి బంజారాల ఓట్లు కీలకమైందని, కానీ ఇప్పటివరకు బంజారా బిడ్డలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం, క్యాబినెట్ హోదా కల్పించినా ప్రమాణస్వీకారం చేయించకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. బంజారాల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పేలా బంజారా బిడ్డలు తప్పకుండా స్పందిస్తారని హెచ్చరించారు. ఫిబ్రవరి 15 కాకుండా వేరే రోజున అధికారికంగా జయంతి జరిపితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా సిద్ధిపేట మాజీ జిల్లా అధ్యక్షుడు నునావత్ మోహన్ నాయక్, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ రాజు నాయక్, కెప్టెన్ చౌడు తండ ఉపసర్పంచ్ అర్జున్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ మ్యూజియం పునరుద్ధరణ పనులు పరిశీలన

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని పురాతన పాఠశాల పరిధిలో ఉన్న సైన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజియంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్న గదులను పరిశీలించి విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్ క్రాఫ్ట్ ప్రదర్శనపై సూచనలు ఇచ్చారు. బిర్లా ప్లానెటోరియం నుండి వచ్చిన ఇన్ఫినిటీ వెల్, డిఎన్ఏ మోడల్, బయాలజికల్ మోడల్స్, గ్లోబ్, మ్యాగ్నెటిక్ లైన్స్, వరల్డ్ క్లాక్, సోలార్ పవర్ వంటి ఎగ్జిబిట్లను పరిశీలించారు. ప్రతి ఎగ్జిబిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలని, విద్యార్థులు మ్యూజియాన్ని సందర్శించి విషయ పరిజ్ఞానం పొందేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి మ్యూజియాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆసియన్ పెయింట్స్ ఏజెన్సీపై నాలుగో రోజుకు చేరిన డ్రైవర్ల సమ్మె




**కరీంనగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లాలో ఆసియన్ పెయింట్స్ ఏజెన్సీ కింద పనిచేస్తున్న డ్రైవర్లు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ డ్రైవర్లు గత పదేళ్లుగా సొంత వాహనాలతో సరుకు రవాణా, హమాలి పనులు చేస్తూ ఉన్నా, ట్రాన్స్పోర్టర్లు చెల్లింపులు సక్రమంగా ఇవ్వకుండా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క వాహనంపై నెలకు రూ.2800 కమిషన్ తీసుకుంటూ, హమాలి చార్జీలు డ్రైవర్లకు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి మాట్లాడుతూ 15 రోజుల క్రితం మేనేజర్‌కు డిమాండ్ల నోటీసు ఇచ్చినా, దాన్ని పట్టించుకోలేదని, పోటీ కార్మికులను తెచ్చి సమ్మె విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. డ్రైవర్లు లోడింగ్, అన్‌లోడింగ్‌కు తగిన చార్జీలు, రూట్ కిరాయిలు, వాహనాల పరిమితి, ప్రతి డ్రైవర్‌కు ఇన్సూరెన్స్, హెల్పర్ సమకూర్చడం వంటి డిమాండ్లతో సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్, కార్యదర్శి కీసర మల్లేశం, కోశాధికారి ఉత్తమల్ల వెంకటేష్, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, కమిటీ సభ్యులు, 60 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

# అందుకే కాంగ్రెస్‌తో పొత్తు -- ఆచారి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకుల అహంకారానికి బుద్ధి చెప్పేందుకే కాంగ్రెస్‌తో జత కట్టినట్లు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి తెలిపారు. శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన పాలకవర్గాన్ని అభినందించిన ఆయన మాట్లాడుతూ, కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో లేని పార్టీతో అభివృద్ధి జరగదని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు అన్ని విధాలా సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, పీసీబీ సభ్యుడు బాలాజీ సింగ్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు భాష గొప్పతనం

తెలుగు అంటే ఒక వెలుగు
అమ్మ భాష తెలుగుభాష
కమ్మనైన భాష తెలుగు
అమ్మ నేర్పిన అమ్మ భాష తెలుగు!!

తీయనైన భాష తెలుగు భాష
అమ్మ ఒడిలోన పలికే తెలుగు భాష
తెలుగు భాష పాటల ఊట
సకల కళలకు పూదోట తెలుగు భాష!!

నలుగురు మెచ్చే నా తెలుగు భాష
బహు చక్కనైన నా తెలుగు భాష
అందరినీ ఒక్కటి చేసే నా తెలుగు భాష
ఆత్మగండ్ల భాష నా తెలుగు!!

స్వచ్ఛమైన తెలుగు భాష
అందమైన మన తెలుగు భాష
సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం తెలుగు భాష
అందమైన ప్రపంచంలో అందమైన భాష తెలుగు!!

అమృతం లాంటి అమ్మ భాష తెలుగు
ఆనందాన్ని ఇచ్చే తెలుగు భాష
ఆత్మ బంధువు లాంటి భాష తెలుగు
వెన్నెల లాంటి వెలుగునిచ్చే తెలుగు భాష
అవని లో అమ్మ భాష గొప్పది!!

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా

**రచన**

దేవులపల్లి రమేశ్,
కలం :వామిక శ్రీ
నంగునూర్, సిద్దిపేట
9963701294.



# కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరాలి

**-- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన పాలకవర్గం మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన బాధ్యత ఎంతో ఉన్నతమైందని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేయడం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యం అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ పర్యవేక్షణలో చైర్మన్‌గా డాక్టర్ పత్య నాయక్, వైస్ చైర్మన్‌గా గీత ఆచారి, కౌన్సిలర్లు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, పీసీబీ సభ్యులు బాలాజీ సింగ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్‌గా నావత్ పత్య నాయక్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పత్య నాయక్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో పారదర్శక పాలన అందిస్తూ, పట్టణాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రకాశం బజార్‌లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని రోడ్డు వెడల్పు పనులు చేపట్టిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జీవనోపాధి కోల్పోతామన్న చిరు వ్యాపారులను పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలోకి తరలించి వారికి తగిన ఏర్పాట్లు చేశారు. పూలు, పండ్లు అమ్ముకునే వ్యాపారులు అక్కడే కొనసాగించవచ్చని హామీ ఇచ్చిన ఆయన, అధికారులు పర్యవేక్షణలో వేగంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.


# షాద్‌నగర్ లో మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



**షాద్‌నగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ మున్సిపల్ కొత్త పాలకవర్గం అంగరంగ వైభవంగా బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్‌గా అగ్గునూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్‌గా అందెమోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై, కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, గెలిచిన వారందరూ సమర్థులేనని, పార్టీలకు అతీతంగా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. యువకుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున యువశక్తిని చాటుతూ షాద్‌నగర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు, నాయకులు వస్తుంటారని, పోతుంటారని కానీ ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేర్చడం ద్వారా గెలిచినవారు నిజమైన సమర్థులవుతారని అన్నారు. ప్రజలతో అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే దిశగా కౌన్సిలర్లు బాధ్యతగా వ్యవహరించాలని, అవినీతి రహిత పాలన సాగించాలని ఆయన హితవు చెప్పారు. తాను ఎల్లప్పుడూ కౌన్సిలర్లకు అండగా ఉంటానని, పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తానని స్పష్టం చేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ విజయం గురించి చెప్పగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో సంతోషపడ్డారని, వెంటనే హెచ్ఎండిఏ కమిషనర్‌తో మాట్లాడి అభివృద్ధికి కావలసిన సహకారం అందించాలని సూచించారని ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన వేళ అభినందనలు, సన్మానాలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, శివశంకర్ గౌడ్, రఘునాయక్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరులు శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. చైర్మన్, వైస్ చైర్మన్ తమ సతీమణులతో కలిసి బాధ్యతలు స్వీకరించగా, కౌన్సిలర్లు, కుటుంబ సభ్యులు, పురాప్రముఖులు పాల్గొన్నారు.

# తొలి తీర్మానంలోనే చౌరస్తా విస్తరణ చేపట్టాలి

-- మున్సిపల్ చైర్మన్‌కు వినతి



**షాద్‌నగర్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని కోరుతూ సామాజిక కార్యకర్త, యువకుడు రాజు నూతన మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందెమోహన్‌లకు వినతి పత్రం అందజేశారు. నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, మున్సిపల్ కౌన్సిల్ ప్రవేశపెట్టే తొలి తీర్మానంలోనే చౌరస్తా విస్తరణ అంశాన్ని చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ ఆలస్యం అవుతున్న కొద్దీ ప్రమాదాలు పెరిగి ఎందరో మృత్యువాత పడుతున్నారని, గత కొంతకాలంగా ఈ సమస్యపై తాను పోరాటం చేస్తున్నానని రాజు పేర్కొన్నారు. నూతన పాలకవర్గం సానుకూలంగా స్పందించి త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ స్పందిస్తూ, పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి

-- పోలే అశోక్



**వెల్దండ, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ బిఆర్ఎస్ పార్టీని బలహీనపరచడమే లక్ష్యంగా పనిచేస్తోందని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోలే అశోక్ విమర్శించారు. ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో ఎనిమిది సీట్లు గెలిచిన అభ్యర్థి చైర్మన్ కావాల్సి ఉండగా, డబ్బు ప్రలోభాలతో కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని చైర్మన్ పదవి కైవసం చేసుకోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే చర్య అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని, ఇకనైనా కక్ష సాధింపు ధోరణి మానుకొని ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని ఆయన సూచించారు.

# ఘనంగా సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం




**బోడుప్పల్, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పురాతన శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పునరనిర్మాణంలో భాగంగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునరనిర్మాణం జరగడం సంతోషకరమని, స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ భక్తులపై ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిహారం ఇవ్వకుండా మోసం చేశారని రైతుల ఆవేదన

న్యాయం చేయాలని వేడుకుంటున్న సర్పంచి యశోదమ్మ



**కడ్తాల్, ఫిబ్రవరి 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామపంచాయతీ లోని సర్వే నెంబర్ 165 విస్తీర్ణం 106 ఎకరాల 30 గుంటలు సర్వే నెంబర్ 160 విస్తీర్ణం 35 ఎకరాలు..ఇలా రైతులను మోసం చేసి రైతుల మీద ఉన్న భూమిని లీజ్ అనే పేరుతో ఎకరాకు ?2 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారాని రైతులు ఆరోపించారు. ఇవ్వని వెడల తమ భూమి తమకు చేస్తానని కొంతమంది రైతులకు సగం పైసలు ఇచ్చి 20 మంది రైతులకు ఒక్క రూపాయి ఇవ్వకుండా ఆన్లైన్లో కార్డులో నుంచి పేర్లు తొలగించడం జరిగిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాంలో భూములేని నిరుపేదలకు అసైన్డ్ పట్టాలు ఇవ్వడం జరిగింది. దళిత కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ నాయిని యశోదమ్మ భూమిని కూడా శ్రీమాక్స్ మైనింగ్ కంపెనీ బద్దం జంగారెడ్డి దళితుల గిరిజనుల పొలాలను మొత్తం బెదిరించి అక్రమంగా లాగేసుకొని రైతులు వ్యవసాయం చేసుకోకుండా మొత్తం దళితుల గోరిలకు 10 మీటర్ల వరకు తోవుతున్నారు. అయన మీద చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మండలంలోని విఠాయిపల్లి ఎంపీయూ పీఎస్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఎంఈఓ పాండు, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు షహావర్, విజయ, రమాకిరణ్, కళావతి, మల్లేశ్వర్, యాదగిరి, జున్ను తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**ఎలిగేడు, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో పద్మపాని సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ వ్యాధులపై 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారం కొమురయ్య, ఉపసర్పంచ్ మేచినేని అండాలు, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, డాక్టర్ సింధూర, ఏఎన్ఎం లత, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, సూపర్వైజర్ లక్ష్మన్, లింక్ వర్కర్ దివ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఛత్రు నాయక్ నియామకం



**అచ్చంపేట, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి మహబూబ్నగర్ జోనల్ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ కోఆర్డినేటర్‌గా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి గ్రామానికి చెందిన ఛత్రు నాయక్ నియమితులయ్యారు. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడిగా పనిచేస్తూ, యువజన కాంగ్రెస్‌లో క్రమశిక్షణతో సేవలందించిన గిరిజన బిడ్డగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగిస్తారని నమ్మకంతో జాతీయ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ సునీల్ పవర్ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఛత్రు నాయక్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన పిసిసి ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్దేశ్వర, కిరణ్ మూగభాష, నేషనల్ ఇంచార్జ్ సుభాష్ యాకర్, అలాగే ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**వెల్దండ, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల గుండాల గ్రామంలోని శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మండల తాసిల్దార్ కార్తీక్ కుమార్ సతీసమేతంగా, కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు కొమ్ము అంజయ్య, అర్చకులు సంతోష్ శర్మ, నరహరి శర్మ, శివశర్మ, సురేష్ శర్మ, కృష్ణయ్య శర్మ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**నల్లగొండ ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేకల అభినవ్ స్టేడియంలో సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవం కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు అనంతరం క్రీడల పతాకాన్ని ఎగరవేశారు ఈ సందర్భంగా క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ఎంతగానో ఆకట్టుకుంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఖలీల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పదవ తరగతి అంతర్గత మార్కుల పరిశీలన పూర్తి




**నల్లగొండ ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్మెంట్ (ప్రాజెక్ట్ పనులు, నోట్‌బుక్స్, పరీక్షలు)కు కేటాయిస్తారు. అంతర్గత మార్కుల పరిశీలనలో భాగంగా గెజిటెడ్ హెడ్మాస్టర్ జి వెంకట్ రెడ్డి మరియు కె వెంకటరెడ్డి బృందం శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నందు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) అంతర్గత మార్కుల పరిశీలన చేయడం జరిగిందని విద్యార్థులకు కేటాయించిన మార్కులు విద్యార్థుల యొక్క నైపుణ్యాలను బట్టి మార్కులు కేటాయించడం జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు తమకు కేటాయించిన జడ్.పి.హెచ్.ఎస్ తిప్పర్తి బాలికలు కేజీబీవీ తిప్పర్తి గౌతమ్ మోడల్ స్కూల్ తిప్పర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసు రాజు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామిడాల నందు అంతర్గత మార్కుల పరిశీలన చేయడం జరిగిందని త్వరలోనే ఇందుకు సంబంధించిన పత్రాలు జిల్లా విద్యాధికారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహ నాయక్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ అపర్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నల్లమలలో అరుదైన నక్షత్రపు తాబేలు







**అచ్చంపేట, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లమల అభయారణ్యంలో అరుదైన నక్షత్రపు తాబేలు లభించింది. ఇటీవల అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం కారణంగా చిన్న జంతుజాలం ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఐటీడీఏ మెడికల్ ఆఫీసర్ డా. కళ్యాణ్ సాగర్ బ్రహ్మగిరి నుండి అచ్చంపేటకు వస్తుండగా రోడ్డు దాటుతున్న భారీ పరిమాణంలో తాబేలు కనిపించడంతో వెంటనే రక్షించి అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారులు మాట్లాడుతూ నక్షత్రపు తాబేలు అంతరించిపోతున్న అరుదైన జాతికి చెందినదని, నల్లమలలో కొద్దికొద్దిగా మాత్రమే సంచరిస్తుందని తెలిపారు. వన్యప్రాణి రక్షణలో చురుకుగా వ్యవహరించిన డా. కళ్యాణ్ సాగర్‌ను ఎఫ్ఆర్ఓ అబ్దుల్ సుగూర్, ఎఫ్ఎస్‌వో నరేంద్ర అభినందించారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**కడ్తాల్, ఫిబ్రవరి 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
ప్రజాపాలన ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మైసిగండి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మాణమైన రామావత్ బుజ్జి నూతన ఇందిరమ్మ ఇంటిని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలోని పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ యాట గీత నర్సింహ,సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్, ఉపసర్పంచ్లు హిరాసింగ్ నాయక్, యాదగిరి రెడ్డి, మాజీ సర్పంచ్ తులసిరామ్, చందోజి, బుజ్జి, చందన్, సుమన్, రాజు, కృష్ణ, ధోలీ, తులసిరామ్ నాయక్, సాయికుమార్, షాబుద్దీన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కండె లింగయ్య గత వారం గుండెపోటుతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వారి నివాసానికి చేరుకొని, లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసి, కుమారులు కండె భాస్కర్, సుమన్ లకు ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గీత, గుర్రం కేశవులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనలో కస్తూరి ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివి

**-- జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి**




**నడికుడ, ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రాథమిక పాఠశాలలో రూ.5 లక్షలతో మౌలిక వసతులు కల్పించిన కస్తూరి ఫౌండేషన్ సేవలను జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి ప్రశంసించారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు కాళం నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజలదేనని, విద్యార్థుల సంఖ్య పెంచి నిలబెట్టుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సన్మాన గ్రహీత కస్తూరి చరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని, విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెరిగితే భవిష్యత్తులో మరింత సహాయం అందిస్తానని తెలిపారు. తదనంతరం చరణ్‌ను జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి, తహసీల్దార్, సర్పంచ్, చైర్మన్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమ ను సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు






**దేవరకొండ ఫిబ్రవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులో భాగంగా శుక్రవారం నాడు కల్వకుర్తి నియోజకవర్గం , తలకొండపల్లి మండలం లోని కోరింతకుంట తండాలోని సరి కల్చర్ రిసోర్స్ సెంటర్ ను సందర్శించారు. వ్యవసాయ వృత్తి విద్య ఉపాధ్యాయుడు బయ్యసందీప్ సమక్షంలో విద్యార్థులకు పట్టుపురుగు జీవిత చరిత్ర పట్టు తయారీ విధానం మల్బరీ తోట పెంపకం వాటి గురించి సెంటర్ నిర్వాహకుడు శక్రు నాయక్ విద్యార్థులకు వివరించాడు. ఈకార్యక్రమంలో వ్యవసాయ వృత్తి విద్యా ఉపాధ్యాయుడు సందీప్,బిచ్చయ్య,ఎన్ఎన్ విజయ్ కుమార్,రమా,రుంషా, రమేష్,సోమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ లో ప్రవేశాల కోసం కరపత్రం ఆవిష్కరణ




**దేవరకొండ ఫిబ్రవరి 20. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో శుక్రవారం మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్య నాయక్ మోడల్ స్కూల్ లో ప్రవేశాల కోసం కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన కై స్థాపించిన పాఠశాల ఆదర్శ పాఠశాల అని అన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ 2026-2027విద్యాసంవత్సరానికి గాను ఆరవ తరగతిలో 100 సీట్లకు 7నుండి 10 వతరగతిలో మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28 వతేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు. ఏప్రిల్ 19 న పరీక్ష ఉంటుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.